ప్రజాశక్తి

బుధవారం 30 ఏప్రిల్ 2025

5

శ్రీ సత్యసాయి





జెఎన్‌టియు భవనం

17న జెఎన్‌టియు స్నాతకోత్సవం

హాజరుకానున్న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు 14వ స్నాతకోత్సవం మే 17 వతేదీన నిర్వహించనున్నట్లు జెఎన్‌టియు వీసీ ఆచార్య హెచ్. సుదర్శనరావు తెలిపారు.ఈ మేరకు ఆయన రిజిస్ట్రార్ ఎస్. కృష్ణయ్య తో కలిసి మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ స్నాతకోత్సవానికి రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. రాష్ట్ర గవర్నర్ తో పాటు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ను కూడా స్నాత కోత్సవంలో పాల్గొనాలని తాము ప్రత్యక్షంగా కలసి ఆహ్వానిస్తామని వీసీ చెప్పారు. జెఎన్‌టియు 14 వ స్నాతకోత్సం సందర్భంగా యూనివర్సిటీ పరిధిలో 2023-24 సంవత్సరంలో బీటెక్, ఫార్మసీ పూర్తి చేసిన విద్యార్థులకు డిగ్రీ పట్టాలు,పి హెచ్‌డి పూర్తి చేసిన పరిశోధక విద్యా ర్థులకు డాక్టరేట్ పట్టాలు, ఉత్తమ మార్కులు సాధించిన 40మంది విద్యార్థులకు బంగారు పతకాలు అందజేయనునట్లు తెలిపారు. స్నాతకోత్సవం నిర్వహణకు ప్రత్యేక కమిటీలను నియమించినట్లు వివరించారు.

బాలయ్యా.. తల్లీబిడ్డల కష్టాలు చూడయ్యా..!

- అసౌకర్యాల నడుమ మాతాశిశు ఆసుపత్రి
- భవన నిర్మాణంలో నిబంధనలు పాటించని కాంట్రాక్టర్
- వేసవిలో పనిచేయని ఏసీలు

హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి తరహాలో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నిత్యం పేర్కొంటున్న మాటలు ఇవి. అయితే మాతా శిశు ఆసుపత్రి పైన నూతనంగా నిర్మాణం చేస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్ సెంటర్ నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్ కనీస నిబంధనలు పాటించక పోవడంతో తల్లీబిడ్డలకు కష్టాలు తెచ్చిపెట్టాయి. మాతా శిశు ఆసుపత్రిలో సుమారు రూ. 25 లక్షలు విలువ చేసే 35 ఏసీలు ఉన్నప్పటికీ తల్లీబిడ్డలకు ఉక్కపోత కష్టాలు తప్పడం లేదు. అష్టకష్టాలు పడుతున్న తల్లీబిడ్డల అగచాట్లను స్థానిక ఎమ్మెల్యే బాలయ్య ఒక్కసారి చూడాలని ఆసుపత్రి రోగులు కోరుతున్నారు.

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి జిల్లాస్థాయి హోదా ఉంది. దీంతోపాటు స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆసుపత్రిని అన్ని విధాల అభివద్ధి చేయాలన్న సంకల్పంతో ముందుకు వెళుతున్నారు. దీనికోసం తన సొంత నిధులతో ఆసుపత్రికి అవసరమైన వైద్య పరికరాలను సైతం అందించారు. హిందూపురం ఆసుపత్రికి గత సంవత్సరం నూతనంగా కేంద్ర ప్రభుత్వం క్రిటికల్ కేర్ యూనిట్ ను మంజూరు చేసింది. భవనాలు నిర్మాణం చేయడానికి ఆసుపత్రి ఆవరణంలో అనువైన స్థలం లేకపోవడంతో మాత శిశు ఆసుపత్రి పైన నిర్మాణం చేయడానికి అనుమతులు తీసుకొని పనులను ప్రారంభించారు. నిర్మాణ పనులు ప్రారంభించినప్పటి నుంచి మాతా శిశు ఆసుపత్రికి కష్టాలు ప్రారంభమయ్యాయి. పనులు చేపట్టిన కాంట్రాక్టర్ కనీస నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా పనులు చేస్తుండడం ఆసుపత్రికి కష్టాలు తెచ్చిపెట్టింది. మాతాశిశు ఆసుపత్రిలో ఉన్న ఏసీలపై నిర్మాణ పనులకు సంబంధించిన సిమెంట్, మట్టి, చిన్న చిన్న ఇటుకలు పడి పాడయ్యాయి. పనులు చేసే సమయంలో వాటి రక్షణకు కనీస చర్యలు చేపట్టక పోవడంతో లక్షల రూపాయల విలువ చేసే ఏసీలు అన్ని చెడిపోయాయి. ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసి చర్యలు చేపట్టాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో పాటు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకపోవడంతో వేసవిలో తల్లీబిడ్డలు ఉక్కపోత కష్టాలు పడుతున్నారు. జిల్లాలోనే ఏ ఆసుపత్రిలో లేని సౌకర్యాలు హిందూ ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న మాతా శిశు విభాగంలో కల్పించారు. ఈ ఆసుపత్రి లో అప్పుడే పుట్టిన శిశువుకు సంబంధించిన ప్రత్యేక వార్డుతో పాటు వివిధ వార్డులను ఏర్పాటు చేసి కోట్లాది రూపాయలు విలువ చేసే వైద్య పరికరాలను సైతం ఏర్పాటు చేశారు. దీంతో హిందూపురంతో పాటు పక్కన ఉన్న మడకశిర, పెనుగొండ నియోజకవర్గాల పరిధిలో ఉన్న గ్రామాలతో పాటు పక్కన ఉన్న కర్నాటక రాష్ట్రం నుంచి ఎంతో మంది అనారోగ్యంగా ఉన్న వారి చిన్నారులను తీసుకొని వచ్చి వైద్య సేవలు పొంది, సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తిరిగి వెళుతున్నారు. ఎంతో



అసుపత్రిలో పని చేయని ఏసీ

మంది తల్లీబిడ్డలకు పునర్జన్మనిస్తున్న మాతా శిశు ఆసుపత్రి నూతనంగా నిర్మాణం చేస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్ వల్ల అనారోగ్యం పాలైంది. వెంటనే చర్యలు తీసుకోవాల్సిన స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అటు వైపు చూడడం లేదు. ఇక జిల్లా అసుపత్రికి ఛైర్మన్‌గా ఉన్న జిల్లా కలెక్టర్ మాత్రం ఎప్పుడైన ఒక సారి అలా వచ్చి ఇలా వెళ్లి పోతున్నారు. గతంలో సైతం అసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశానికి వచ్చి ఓపి నిర్వహణపై పలు మార్పులు చేయాలని స్థానిక అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అయితే నేటికి అవి అమలు కాలేదు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ప్రత్యేక చర్యలు తీసుకుని ఉక్కపోతతో అల్లాడుతున్న తల్లీబిడ్డల కష్టాలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

కాంట్రాక్టర్‌కు వివరించాం



మాతాశిశు అసుపత్రి పైన నూతనంగా నిర్మాణం చేస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్ చేపట్టిన పనుల్లో భాగంగా మాతాశిశు అసుపత్రిలో ఉన్నా ఎసిలు మరమ్మతులకు గురయ్యాయి. దీనికి సంబందించి ఎసీలను వెంటనే మరమ్మతు చేయించాలని సంబందిత కాంట్రాక్టర్‌కు వివరించాము. ఆయన స్పందించకుంటే ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

లింగన్న,
మెడికల్ సూపరింటెండెంట్



మాత శిశు అసుపత్రిలో ఏర్పాటు చేసిన ఏసీలకు బయట ఏర్పాటు చేసిన ఫ్యానపై మట్టి పెళ్లలు పడిన దృశ్యం

నేడు పాలిసెట్

ప్రజాశక్తి-హిందూపురం

పాలిసెట్-2025ను బుధవారం పట్టణంలో 5 కేంద్రాల్లో ఉదయం 11 గంటల నుంచి 1 గంట వరకు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పాలీసెట్-2025 కోఆర్డినేటర్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ హరీష్ బాబు తెలిపారు. పట్టణంలో పరీక్షలు నిర్వహిస్తున్న శ్రీ బాలాజీ విద్యా విహార్ డిగ్రీ కాలేజ్, సప్తగిరి డిగ్రీ కాలేజ్, బాలయేసు డిగ్రీ కాలేజ్, బాలయేసు జూనియర్ కాలేజ్, ఎంజీఎం హై స్కూల్ లలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను ఈసందర్భంగా ఆయన పరిశీలించారు. విద్యార్థులు ఉదయం 10 గంటలకు వారికి కేటాయించిన పరీక్షా కేంద్రాలకు హాజరు కావాలన్నారు. ఉదయం 11 గంటల తర్వాత పరీక్ష రాయడానికి అనుమతించరని అన్నారు. హిందూపురం పట్టణంలో 5 పరీక్షా కేంద్రాల్లో 1797 మంది అభ్యర్థులకు పాలీసెట్ -2025 పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాలీసెట్‌కి దరఖాస్తు చేసి రుసుము చెల్లింపులలో సాంకేతిక లోపాలు తలెత్తటం ద్వారా హాల్ టికెట్ రాని అభ్యర్థులు బుధవారం ఉదయం 9 గంటల లోపు స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలను సంప్రదించాలన్నారు. అటువంటి అభ్యర్థులు రిజిస్టర్ చేసిన అప్లికేషన్ జిరాక్స్, ఫీజు ఎస్సీ, ఎస్టీలు రూ. 100, ఇతరులు రూ. 400 చెల్లించి, రెండు పాస్

ఆర్డీటీ ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలి : సిపిఎం

ప్రజాశక్తి పుట్టపర్తి క్రైమ్



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆర్డీటీ ఎఫ్ సిఆర్ఎ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సిఆర్ఎ (ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్) రెన్యువల్ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈఎస్ వెంకటేష్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఆధ్వర్యంలో కలెక్టర్ టిఎస్ చేతన్‌కు ఆ పార్టీ నాయకులు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం వెంకటేష్ మాట్లాడుతూ కరువు నిలయమైన అనంతపురం ఉమ్మడి జిల్లాల్లో ఆ సంస్థ పేదల అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేసిందన్నారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోనూ 21 జిల్లాలు 150 మండలాల్లో దాదాపు 4.50 లక్షల పేద కుటుంబాలకు విద్య, వైద్యం, గృహ నిర్మాణాలు, పొదుపు సంఘాలు, వికలాంగులకు చేయూత, క్రీడల అభివృద్ధి, రైతాంగానికి కూలీలకు ఉపాధి కల్పించడం యువతకు తగిన శిక్షణలో ఇవ్వడం లాంటి కార్యక్రమాలు నిస్వార్ధంగా అందిస్తోందన్నారు. ఎన్నో కోట్ల రూపాయల నిధులతో విదేశీ దాతల సహకారంతో కార్యక్రమాలు చేపట్టిందన్నారు. కేంద్రం ఇప్పటికైనా పునరాలోచించి తగిన చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ప్రజా ఉద్యమాలు చేపట్టాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు బ్యాళ్ల అంజి, కొత్తచెరువు మండల కార్యదర్శి ముత్యాలప్ప, ఆ పార్టీ శాఖ కార్యదర్శి ఎస్. వెంకటేశు, కార్యాలయ కార్యదర్శి సిద్ధు, తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి-కొత్తచెరువు

పేద విద్యార్థులకు ప్రయివేట్ పాఠశాలల్లో 25 శాతం ఉచిత ప్రవేశాలు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పేద విద్యార్థులు మే 2 నుంచి 19వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని డిఇఒ జి.కృష్ణప్ప మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో మే 20 నుంచి 24వ తేదీ వరకూ విద్యార్థుల ప్రవేశానికి అర్హతలు నిర్ణయిస్తారన్నారు. లాటరీ విధానంలో తొలి విడత ఫలితాలను మే 29వ తేదీ విడుదల చేస్తారని, సీట్లు సాధించిన విద్యార్థులను జూన్ 8వ తేదీ ఖరారు చేస్తారు. రెండో విడత ఫలితాలను జూన్ 11వ తేదీ విడుదల చేసి, సీట్లు సాధించిన విద్యార్థులను జూన్ 18వ తేదీ ఖరారు చేస్తారని తెలిపారు. విద్యార్థులు https:// cse.ap.gov.in వెబ్‌సైట్‌లో మాత్రమే అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు టోల్ ఫ్రీ నెంబర్ 1800425899 సంప్రదించాలన్నారు.

తొలగించిన నాయకులతో సంబంధం లేదు

ప్రజాశక్తి-హిందూపురం

భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) నుండి తొలగించిన నాయకులతో తమ సంఘానికి ఏ మాత్రం సంబంధం లేదని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఈరేష్, నాగార్జున తెలిపారు. ఈ మేరకు వారు మంగళవారం హిందూపురంలో విలేకరులతో మాట్లాడుతూ పెనుకొండలో జరిగిన మహాసభ లోనే హిందూపురం నుండి చంద్ర, ఇతర సీనియర్ నాయకులను తొలగించడం జరిగిందన్నారు. వీరితో తమ సంఘానికి ఎలాంటి సంబంధం లేదని చెప్పారు.

మేడేను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-హిందూపురం

కార్మిక దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని పారిశ్రామిక వాడ కార్మిక సంఘం నేత రవికుమార్ కోరారు. మంగళవారం కార్మిక దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరుతూ తూమకుంట పారిశ్రామిక వాడలోని ఓ పరిశ్రమలో కార్మికులతో కలిసి కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పి బాబు, ప్రధాన కార్యదర్శి జి దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

విహారయాత్రకు విద్యార్థులు

ప్రజాశక్తి-హిందూపురం

సమగ్ర శిక్ష ద్వారా హిందూపురం, మడకశిర నియోజకవర్గంలోని 50 మంది విద్యార్థులు మంగళవారం విహారయాత్రకు బయలుదేరారు. పట్టణంలోని స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద బస్సును హిందూపురం ఎంఇఒ గంగప్ప, పరిగి ఎంఇఒ శేషాచలంలు జెండా ఊపి ప్రారంభించారు. విహారయాత్ర ద్వారా బెంగళూరులోని విశ్వేశ్వరయ్య మ్యూజియం, ఈషా ఫౌండేషన్, అక్వేరియం, జంతు ప్రదర్శనశాల తదితర వాటిని సందర్శిస్తారని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాద్, సూర్యనారాయణ, చలపతి, పావని, జగదీష్, నాగేంద్ర, సత్యవాణి, విష్ణు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఐటిఐలో ప్రవేశానికి అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని శ్రీకంఠపురం ఝూన్సీ లక్ష్మీబాయి పురపాలక ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ(ఐటీఐ) లో ప్రవేశానికి మొదటి విడత అడ్మిషన్స్ ప్రారంభమైనట్లు ప్రిన్సిపల్ రాయపురెడ్డి మంగళవారం పేర్కొన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థిని, విద్యార్థులు ఆసక్తి గల వారు మే 245 తేదీలోపు https://iti.ap.gov.in వెబ్‌సైట్ లో ఆన్ లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ పూర్తి అయిన దరఖాస్తుదారులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9440258629, 9490445744కు సంప్రదించాలని కోరారు.

అధికారుల తీరుపై కౌన్సిలర్ల ఆగ్రహం

కమిషనర్‌ను నిలదీసిన సభ్యులు
వాడీవేడిగా కదిరి మున్సిపల్ కౌన్సిల్‌మీట్



కమిషనర్‌ను ప్రశ్నిస్తున్న కౌన్సిలర్లు

ప్రజాశక్తి - కదిరి టౌన్

మున్సిపల్ అధికారుల తీరుపై కౌన్సిలర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు పట్టణాభివృద్ధికి కృషి చేయకుండా మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతున్నారని ఆరోపించారు. మంగళవారం పట్టణంలోని కౌన్సిల్ హాల్ నందు మున్సిపల్ ప్యానల్ చైర్మన్ హరిణి అధ్యక్షతన మున్సిపల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు కౌన్సిలర్లు అధికారుల తీరుపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మున్సిపాలిటీలో 30 అడుగుల జాగాకు అనుమతులు పొంది మున్సిపాలిటీ స్థలాన్ని ఆక్రమించి 50 అడుగులలో భవనాలు నిర్మిస్తున్నా అధికారులకు పట్టదా అని 25వ వార్డు కౌన్సిలర్ ఆల్ఫా ముస్తఫా అధికారులను నిలదీశారు. కదిరి మున్సిపాలిటీలో ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి భవనాలు నిర్మాణాలు చేస్తున్నారని ఆధారాలతో సహా అధికారులకు చూపించిన ఎందుకు చర్యలు చేపట్టలేదనిప్రశ్నించారు .కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలం కబ్జా ఆపై పెద్ద పెద్ద భవనాల నిర్మాణాలకు అప్రూవల్ ఎలా ఇస్తారని అధికారులను నిలదీశారు. ఈవిషయంపై మున్సిపల్ కమిషనర్ సభ్యులకు సరైన సమాధానం చెప్పకుండా దాటవేత ధోరణి ప్రదర్శించారు. అనంతరం పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలపడంతో ఎన్ని రోజులు సమయం కావాలని కౌన్సిలర్ కమిషనర్‌ను ప్రశ్నించారు. దీంతో ఆయన సరైన సమాధానం చెప్పకపోవడంతో మిగిలిన కౌన్సిలర్లు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ స్థలాలు స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. పట్టణంలో జీవిమాను కూడలి మార్కెట్ సమీపాన ఇక్బాల్ రోడ్డును దుకాణదారులు ఆక్రమించారని దీంతో ట్రాఫిక్ సమస్య ఎక్కువైందని వెంటనే చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులను అధికారులను కోరారు. ది అలాగే ప్రస్తుతం వర్షాకాలం మొదలైంది. దీంతో పట్టణ.లో దోమలు ఎక్కువయ్యాయి. దోమల నివారణ కోసం ఫ్యాగింగ్ వంటి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కార్మికులకు చెత్త సేకరణ కోసం ట్రాక్టర్లు క్యాంప్టర్లు పనిముట్లు అందజేయాలని అధికారులను కోరారు. అనంతరం పది అంశాలకు సంబంధించి కౌన్సిల్లో సభ్యుల ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు, మున్సిపల్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రేవ్, పోక్సో కేసులపై దృష్టిసారించాలి : ఎస్పీ



ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ఎస్పీ రత్న

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

గ్రేవ్, పోక్సో కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ రత్న ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలోని డిఎస్పీలు, సిఐలు , ఎస్ఐలతో సీసీటీఎన్ఎస్ ద్వారా నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాపర్టీ కేసులలో రికవరీలు పెంచాలన్నారు. దొంగతనాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈసందర్భంగా సబ్ డివిజన్ లో దీర్ఘకాలంగా ఉన్న పెండింగ్ కేసుల గురించి సమీక్షించి ఆరా తీశారు.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నేరస్థులను పట్టుకోవాలన్నారు .అసాంఘిక కార్యకలాపాలైన క్రికెట్ బెట్టింగ్ , గ్యాంబ్లింగ్ మట్కా ఎక్కడ లేకుండా చేయాలన్నారు.డ్రంకెన్ డ్రైవింగ్ వలన ఎక్కడ అయినా రోడ్డు ప్రమాదాలు జరిగితే తీవ్రంగా పరిగణించాలన్నారు. మెజిస్ట్రేట్ లను కలిసి కేసుల పరిష్కారాలకు చర్యలు తీసుకోవాలన్నారు. దొంగతనాలు నేరాలు జరగకుండా పగలు రాత్రి గస్తీని పెంచాలని ఆదేశించారు. సోషల్ మీడియా పై గట్టి నిఘా ఉంచాలన్నారు. పోలీసు అధికారులు పల్లెనిద్ర గ్రామ సందర్శనలు చేపట్టి సైబర్ నేరాల గురించి ప్రజలకు అవగాహన చేయాలన్నారు. అనంతరం వివిధ కేసులలో ప్రతిభ కనబరచిన 44 మంది పోలీసు అధికారులు, పోలీసు సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ నేర సమీక్షా సమావేశంలో డీఎస్పీలు విజయకుమార్, శివన్నారాయణ స్వామి, నరసింగప్ప, హేమంత్ కుమార్ , ఎస్‌బి సిఐ బాలసుబ్రమణ్యం రెడ్డి, ఎస్ఐ ప్రదీప్ కుమార్ కుమార్, సిఐలు, ఎస్ఐలు ఉన్నారు.

విధిగా మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేయండి

కలెక్టర్ టిఎస్ చేతన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో విరివిగా మొక్కలు నాటేందుకు తగిన ప్రణాళికను సిద్ధం చేయాలని కలెక్టర్ టిఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో అటవీ శాఖ, ఎన్‌హెచ్ఎ, ఆర్‌అండ్‌బి, పంచాయతీ రాజ్ అధికారులతో 2025 సంవత్సరమునకు మొక్కలు నాటే కార్యక్రమంపై ముందస్తు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 5న ప్రపంచ పర్యావరణ, పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాల్లో, దేవాలయాల్లో, మసీదులలో, చెరువు గట్లపై, బంజర భూములలో మొక్కలు నాటేందుకు ఎన్ని మొక్కలు అవసరం అవుతాయో డిఎఫ్ఒకు సమర్పించాలన్నారు. 32 మండలాలకు సంబంధించిన ప్రత్యేక అధికారులు, అన్ని శాఖల హెచ్ఒడిలు జాబితా సమర్పించాలన్నారు. జిల్లాలో 1,74,065 హెక్టార్ల భూమిలో పది లక్షల 40 వేల మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఎక్కువగా కరివేపాకు, నిమ్మ, దానిమ్మ, మొదలైన మొక్కలు నాటాలని, జాతీయ రహదారుల వెంట విరివిగా మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, డిపిఒ సమత, పరిశ్రమల శాఖ జిఎం నాగరాజు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

గంజాయి, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా అరికట్టాలి : జిల్లాలో గంజాయి, మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల అక్రమ రవాణా నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ టిఎస్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లో మాదకద్రవ్యాల నియంత్రణ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్పీ రత్న, ఫారెస్ట్, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంబంధిత అధికారులు జాయింట్ ఆపరేషన్ చేపట్టి మత్తు పదార్థాలు రవాణాను నియంత్రించాలన్నారు. మత్తు పదార్థాలు రవాణా చేసే వారికి వేసే శిక్షలు గురించి అందరికీ తెలిసే విధంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. గ్రామస్థాయిలో, విద్యాసంస్థలలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అనంతరం మత్తు పదార్థాలపై అవగాహన కల్పించి గోడ పత్రికను కలెక్టర్, ఎస్పీ తదితరులు ఆవిష్కరించారు.

వడ్డీతో రైతు రుణాలు రెన్యువల్ చేయాలి

ప్రజాశక్తి-పెనుకొండ

వడ్డీ మాత్రమే కట్టించుకొని రైతుల పంట రుణాలను రీ షెడ్యూల్ చేయాలని కోరుతూ మంగళవారం ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో ఆర్‌డిఒ ఆనంద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి మాట్లాడుతూ రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్ని బ్యాంకుల్లో రైతుల పంట రుణాల రీషెడ్యూల్ ప్రక్రియ జరుగుతోందన్నారు. అసలు, వడ్డీ కట్టించుకొని రీ షెడ్యూల్ చేయడం వల్ల రైతులకు భారం అవుతుందన్నారు. ఇప్పటికే రైతులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. అకాల వర్షాలతో పంటలు పండక, పండించిన పంటలకు గిట్టుబాటు ధర రాక రైతాంగం తీవ్ర సంక్షోభంలో కురుకుపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. రీషెడ్యూల్ కోసం ప్రయివేట్ వడ్డీ వ్యాపారులు, దళారులను ఆశ్రయించాల్సి వస్తుందన్నారు. కావున బ్యాంకు అధికారులతో చర్చించి వడ్డీ మాత్రమే కట్టించుకొని రుణాలు రీ షెడ్యూల్ చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల నాయకులు లక్ష్మినరసప్ప, వ్యకాసం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, సిఐటియు మండల కన్వీనర్ బాబావలి, తిప్పన్న, మహబూబ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : వడ్డీ మాత్రమే కట్టించుకుని రైతుల పంట, బాంగారు తాకట్టు రుణాలను రెన్యువల్ చేయాలని కోరుతూ మంగళవారం ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో ఆర్‌డిఒ మహేష్‌కు వినతి పత్రం అందజేశారు. నాయకులు జంగాలపల్లి పెద్దన్న, ఎస్‌హెచ్.బాషా మాట్లాడుతూ జిల్లాలో ఐదేళ్ల నుంచి కరువు కాటకాలతో పంటలు పండక, పండిన పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు ఆర్థికంగా చితికి పోయారన్నారు. కొందరు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస పోగా, కొందరు ఆత్మహత్య లకు పాల్పడ్డారన్నారు. కావున డివిజన్ పరిధిలోని రైతులు బ్యాంకుల్లో తీసుకున్న పంట, బంగారు తాకట్టు రుణాలను వడ్డీ మాత్రమే కట్టించుకుని రెన్యువల్ చేసేలా బ్యాంకర్లను ఆదేశించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు, సిపిఎం నాయకులు హైదర్‌వలి, నామాల నాగార్జున, రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి www.prajasakti.com

రాప్తాడు మార్కెట్ యార్డు ఛైర్మన్‌గా బోయపాటి సుధాకర్

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

రాప్తాడు మార్కెట్ యార్డు నూతన ఛైర్మన్‌గా వేపకుంటకు చెందిన బోయపాటి సుధాకర్ ను నియమించారు. ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌తో పాటు 15 మంది సభ్యులతో కూడిన నూతన కమిటీని మంగళవారం ప్రభుత్వం ప్రకటించింది. వైస్ ఛైర్మన్ గా గంగులకుంట కృష్ణయ్య, డైరెక్టర్లుగా దేవరకొండ సాలమ్మ, ఎస్.శివలక్ష్మి, చెన్నకేశవనాయుడు, పోతన్న, బాలునాయక్, రఘునాథ్‌రెడ్డి, జెన్నే నాగలక్ష్మి, రామాంజనమ్మ, లక్ష్మీనరసమ్మ, అంకె మంజునాథ్, వరలక్ష్మి, రఫీ, గోనుగుంట్ల సౌమ్య నియమితుల య్యారు. 8 మంది ఓసీలు, నలుగురు బీసీలు, ఇద్దరు ఎస్సీలు, ఒక ఎస్టీకి అవకాశం కల్పించారు. నూతన ఛైర్మన్ సుధాకర్‌తో పాటు కమిటీ సభ్యులు రామగిరి మండలంలోని వెంకటాపురం గ్రామం వెళ్లి ఎమ్మెల్యే పరిటాల సునీతను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పని చేసిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందన్నారు. మార్కెట్ యార్డ్ అభివృద్ధి కోసం సమిష్టిగా పని చేయాలన్నారు. మార్కెట్ యార్డులో సేవలను మరింత పెంచాలని, రైతులకు ఏ ఇబ్బంది కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. ప్రభుత్వానికి, ఎమ్మెల్యే సునీతకు మంచి పేరు తెచ్చేలా పని చేస్తామని ఛైర్మన్ సుధాకర్ తెలిపారు.



ఎమ్మెల్యే సునీతను కలిసిన రాప్తాడు మార్కెట్ యార్డ్ కమిటీ ఛైర్మన్

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమమే

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుంటే ఉద్యమం తప్పదని రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్‌వి.రమణ స్పష్టం చేశారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల సాధన కోసం మంగళవారం కదిరి డిపో ఆవరణలో ఉద్యోగులు చేపట్టిన రిలే దీక్షలను రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్‌వి.రమణ, డిపో అధ్యక్షుడు రామకృష్ణ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ సమస్యల పరిష్కారంలో యజమాన్యం తాత్సారం చేస్తే ఉద్యమం తీవ్రం చేస్తామన్నారు. శిబిరంలో డి.లక్ష్మీనారాయణ, సుబ్రమణ్యం, గంగిరెడ్డి, శ్రీనివాసులు, జిలాన్, రాజ్‌కుమార్, షాకీర్, డిపో కార్యదర్శి బైరిశెట్టి, నారాయణస్వామి, జిలాన్, నాగరాజు, చంద్రశేఖర్‌రెడ్డి, పులి శ్రీనివాసులు, గంగన్న, బాబాఫకృద్దీన్ కూర్చున్నారు.

పుట్టపర్తి క్రైమ్ : పట్టణంలోని ఆర్టీసీ డిపో ముందు ఆర్టీసీ ఉద్యోగులు చేపట్టిన నిరాహార దీక్షలు కొనసాగాయి. వీరి దీక్షకు ఎన్ఎంయుఎ కడప జోనల్ కార్యదర్శి చెన్నారెడ్డి, రీజినల్ అధ్యక్షులు శ్రీరామ్‌నాయక్, కార్యదర్శి షబ్బీర్, రవి సంఘీభావం తెలిపారు. దీక్షలో డిపో కార్యదర్శి గంగులయ్య, డిపో ఛైర్మన్ ఈశ్వరయ్య, నాయకులు పివి.రాముడు, షరీఫ్, శ్రీనివాసులు, ప్రేమకుమారి, రాజేశ్వరి, ప్రశాంతి, కళావతి, శివారెడ్డి పాల్గొన్నారు.

మడకశిర : పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో ఎన్ఎంయుఎ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం కూడా కొనసాగాయి. దీక్షా శిబిరంలో డిపో కమిటీ వైస్ ప్రెసిడెంట్ పురుషోత్తం, సీనియర్ డ్రైవర్ రాజేంద్ర, కండక్టర్ కార్తీక్ కూర్చున్నారు. వీరికి పలువురు ఉద్యోగులు మద్దతు తెలిపారు. శిబిరాన్ని జోనల్ సెక్రటరీ చెన్నారెడ్డి, రీజనల్ సెక్రటరీ షబ్బీర్, అధ్యక్షులు శ్రీరామనాయక్, జాయింట్ సెక్రటరీ రవి సందర్శించి డిమాండ్లను ప్రస్తావించారు.

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం : టిడిపి

ప్రజాశక్తి-పెనుకొండ

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని టిడిపి తెలిపారు. టిడిపి ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని ఎగువగడ్డ కాలనీ, పాతఫోస్టాఫీస్ రోడ్డు, చెరువు రోడ్డు, 12, 13 వార్డుల్లో పర్యటించారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తూ, వార్డు సమస్యలు తెలుసుకొని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పట్టణ కన్వీనర్ శ్రీరాములు యాదవ్ మాట్లాడుతూ ప్రతిరోజూ కొన్ని వార్డుల్లో పర్యటించి ప్రజల సమస్యలు గుర్తించి వాటిని మంత్రి సవిత దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పెనుకొండ మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు రమణమ్మ, నాయకులు పాలడుగు చంద్ర, సాయిప్రసాద్, త్రివేంద్ర, ప్రభంజనకుమార్, రామాంజనేయులు, కృష్ణమూర్తి, సుబ్రహ్మణ్యం, చంద్ర కాంతమ్మ, నారాయణనాయక్, డ్వాక్రా రామాంజనేయులు, కురుబ నంజుండ, చంద్ర, నూర్, నారాయణ, బోయ సోము, రాజేంద్ర ప్రసాద్, జిలాన్, మంగల రామాంజనేయులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న టిడిపి నాయకులు

పౌరహక్కులపై అవగాహన



పౌరహక్కుల దినోత్సవంలో పాల్గొన్న అధికారులు

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

మండలంలోని వీరఓబనపల్లి గ్రామంలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కాలనీలో మంగళవారం తహశీల్దార్ అనంతాచారి ఆధ్వర్యంలో సివిల్స్ రైట్స్ గ్రామసభ నిర్వహించారు. ఇందులో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన ప్రత్యేక చట్టాలు, హక్కుల గురించి కాలనీవాసులకు వివరించారు. భూమి, నీరు, వీధి దీపాలు, డ్రెయినేజీల సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసులు కోరారు. అంగన్వాడీ టీచర్, ఆశా వర్కర్ పనితీరు సరిగా లేదని ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు ఆయా సమస్యలను వారం రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వెంకటాపురం సర్పంచి శివశంకర్‌రెడ్డి, ఆర్ఐ, వీఆర్వో, వార్డెన్, తదితరులు పాల్గొన్నారు.

నేడు మద్దిపిలో పౌరహక్కుల దినోత్సవం

లేపాక్షి : మండలంలోని మద్దిపి గ్రామంలో బుధవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ సౌజన్యలక్ష్మి తెలిపారు. భారత రాజ్యాంగం కల్పించిన పౌరహక్కులు, వాటి పరిరక్షణపై అవగాహన కల్పిస్తారన్నారు. కావున మండలం స్థాయి అధికారులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని తహశీల్దార్ కోరారు.

శక్తి యాప్‌పై అవగాహన

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ప్రతి ఒక్కరూ శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని శక్తి టీం నోడల్ అధికారి, మహిళా పిఎస్ డీఎస్పీ ఆదినారాయణ సూచించారు. డీఎస్పీ పర్యవేక్షణలో మంగళవారం శక్తి యాప్‌పై మహిళలు, యువతులు, బాలికలకు అవగాహన కల్పించారు. డీఎస్పీ మాట్లాడుతూ శక్తి యాప్ మహిళలకు అత్యవసర సమయంలో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. యాప్‌లో బటన్ ప్రెస్ చేయగానే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం చేరుతుందన్నారు. ప్రమాదకర పరిస్థితుల్లో యాప్ ద్వారా పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో పాటు, అత్యవసర సేవలు అందించేందుకు ఇది ఎంతో మేలైన సాధనం అన్నారు. అంగనవాడీ సెంటర్లు, బస్టాండ్, రైల్వేస్టేషన్, జన సంచారం ఉన్న ప్రదేశాల్లో శక్తి బృందాలు పర్యటించి ప్రతీ యువతి ఫోన్‌లో మహిళా శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు.

'ఉపాధి'లో అవినీతికి పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి-తాడిమర్రి

'ఉపాధి' హామీ పనుల్లో అవినీతి, అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎంపిడిఓ వెంకటరంగారావు హెచ్చరించారు. తాడిమర్రిలో మంగళవారం ఉపాధి హామీ కూలీలతో సమావేశం నిర్వహించారు. ఎంపిడిఓ మాట్లాడుతూ కూలీలకు పనికి తగ్గట్లు వేతనం వస్తుందన్నారు. రోజుకు రూ. 307 కూలి పడేలా ఇచ్చిన కొలతల మేరకు పని చేయాలన్నారు. పనికి రాని వారి పేర్లను నమోదు చేయరాదని, అలా చేస్తే ఆ గ్రూపు మేట్‌పై చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే కూలీల ఖాతా ఉన్న బ్యాంకులో రూ. 20తో పిఎంఎస్‌బివై, పిఎంజెజెబివై బీమా చేయించాలన్నారు. కూలీలు ప్రమాదవశాత్తూ మృతిచెందితే రూ. 2 లక్షలు, అంగవైకల్యం ఉంటే రూ. లక్ష బీమా వస్తుందన్నారు. సమావేశంలో ఎపిఓ అనిల్‌కుమార్‌రెడ్డి, ఈసి సాయికృష్ణ, టిఎలు పుణ్యవతి, భారతి, ఎఫ్ఎ గణేష్, మేట్‌లు పాల్గొన్నారు.




ఉపాధి పనులపై ప్రజలతో మాట్లాడుతున్న అధికారులు

4న కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మే 4వ తేదీ ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షులు షీలా నాగేంద్ర, ఉపాధ్యక్షులు సుంకు సుకుమార్, కార్యదర్శి జయరామ్, కోశాధికారి వంకదారి మోహన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం పట్టణం లోని స్వాతి క్లినిక్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం కరపత్రాలను విడుదల చేశారు. యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షులు మాట్లాడుతూ నేత్ర జ్యోతి కంటి ఆసుపత్రి బెంగళూరు, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో శిబిరంలో నిర్వహిస్తామని, ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ వైద్య నిపుణులు వైద్య సేవలు అందిస్తారన్నారు. కందికేరి బసమ్మ, కందికేరి సోమశేఖర్ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు దాతలుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఆధార్ కార్డు లేదా ఓటరు ఐడి లేదా రేషన్ కార్డు జిరాక్స్, ఫోన్ నెంబర్ తీసుకుని రావాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వో రాధాకృష్ణ, కోలా ప్రభాకర్, డాక్టర్ బివి.సుబ్బారావు, కోటేశ్వరరావు, చాంద్‌బాషా, కౌన్సిలర్ కేతా లోకేష్, జయంతి వినోద్‌కుమార్ పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న యువర్స్ ఫౌండేషన్ సభ్యులు



మంత్రి దుర్గేష్‌ను కలిసిన జనసేన నాయకులు

కదిరిని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని వినతి

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కదిరి జనసేన పార్టీ ఇన్‌ఛార్జి భైరవప్రసాద్ రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను మంగళవారం మంగళగిరిలో మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు. అలాగే మంత్రికి ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ప్రసాదం అందజేసారు. కదిరి ప్రాంతంలో ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, యోగి వేమన సమాధి, ప్రపంచ ప్రసిద్ధిగాంచిన తిమ్మమ్మ మర్రిమాను ఉన్నాయని, కావున పర్యాటకంగా అభివృద్ధి చేయాలని, అలాగే కదిరి ప్రాంతాన్ని సందర్శించాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. వారితో పాటు తలుపుల, నల్లచెరువు మండలాల కన్వీనర్లు జయవర్ధన, రవికుమార్, అంజిబాబు ఉన్నారు.

నేడు పాలి సెట్


ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశం కోసం బుధవారం పాలిసెట్ నిర్వహిస్తున్నట్లు పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ సురేష్‌బాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక తారకరామాపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్, కెహెచ్ డిగ్రీ కళాశాల, ఎపి మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల, కొత్తపేట మున్సిపల్ బాలికల పాఠశాల, సాయిబాబా గుడి వద్ద ఉన్న శ్రీనివాస డిగ్రీ, పీజీ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ పరీక్ష నిర్వహిస్తామన్నారు. విద్యార్థులను 10 గంటలకే పరీక్ష హాలులోకి అనుమతిస్తారని, పరీక్ష ప్రారంభం సమయం తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతి లేదని తెలిపారు.

భూ రీసర్వేపై సమీక్ష సమావేశం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం డివిజన్‌లోని మండల రెవెన్యూ అధికారుల తో భూ రీసర్వేపై శిక్షణ, సమీక్ష సమావేశం నిర్వహించారు. రీసర్వేలో క్షేత్రస్థాయిలో తలెత్తే సమస్యలను క్షేత్రస్థాయి సిబ్బంది తెలుపగా వాటిని పరిష్కరించడంలో తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఆర్డీవో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రీసర్వేను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని, ఎలాంటి తప్పులు లేకుండా విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో జెసి అభిషేక్‌కుమార్, ఆర్డీవో మహేష్, తహశీల్దార్లు, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్లు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే అధికారులు, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థి గౌతమ్‌కుమార్‌రెడ్డికి ప్రశంసాపత్రం అందజేస్తున్న డిఇఓ జి.కృష్ణప్ప

'పది' మండల టాపర్‌కు డిఇఓ అభినందనలు

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

పదో తరగతి పరీక్షల్లో 597 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంకు, జిల్లాలో ద్వితీయ ర్యాంకుతో పాటు మండల టాపర్‌గా నిలిచిన వశిష్ట పాఠశాల విద్యార్థి గౌతమ్‌కుమార్ రెడ్డిని మంగళ వారం డిఇఓ జి.కృష్ణప్ప అభినందించి ప్రశంసాపత్రం అందజేశారు. డిఇఓ మాట్లాడుతూ గౌతమ్ భవిష్యత్తులో ఉన్నత చదువులు చదవాలని ఆకాంక్షించారు. అలాగే విద్యార్థి తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వశిష్ట పాఠశాల కరస్పాండెంట్ పిట్టా శివశంకరరెడ్డి పాల్గొన్నారు.

అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలకు ఇబ్బందులు

ప్రజాశక్తి-తలుపుల

తలుపులతో పాటు మండల వ్యాప్తంగా అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. వారం రోజుల నుంచి పగలు, రాత్రి తేడా లేకుండా ఎప్పుడుపడితే అప్పుడు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారని మండిపడ్డారు. ఉక్కపోతకు వృద్ధులు, చిన్నారులు, బాలింతలు, గర్భిణులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. కావున విద్యుత్ శాఖ అధికారులు గమనించి అప్రకటిత కోతలు లేకుండా సక్రమంగా విద్యుత్ సరఫరా చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

బిసివై పార్టీ అధ్యక్షునికి ఘన స్వాగతం

ప్రజాశక్తి-బత్తలపల్లి

భారత చైతన్య యువజన(బిసివై) పార్టీ అధ్యక్షులు బోడె రామచంద్రయాదవ్‌కు మంగళవారం బత్తలపల్లిలో గంటాపురం జగ్గు, తదితరులు ఘన స్వాగతం పలికారు. రామచంద్రయాదవ్‌ను తన ఇంటికి మర్యాదపూర్వకంగా ఆహ్వానించినట్లు జగ్గు తెలిపారు. వారి భేటీలో నియోజకవర్గంలోని రాజకీయాలపై చర్చించినట్లు తెలిపారు. కార్యక్రమలో నరసింహయాదవ్, ముష్టూరు సాంబ, మారుతి, బిసి.సురేష్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

సోలార్ ప్రాజెక్ట్ కోసం భూసేకరణ ఆపాలి

ప్రజాశక్తి-మడకశిర

సోలార్ ప్రాజెక్ట్ కోసం రైతుల నుంచి భూసేకరణ ఆపాలని, లేనిచో రైతుల పక్షాన పోరాటాలకు సిద్ధమని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు హరి స్పష్టం చేశారు. ఎపి రైతు సంఘం మండల కన్వీనర్ సిఆర్.రెడ్డి అధ్యక్షతన మంగళవారం పట్టణంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరి మాట్లాడుతూ సోలార్ ప్రాజెక్టు కోసం వ్యవసాయ భూములు సేకరిస్తే రైతులు వారి భూముల్లో వారే రోజు వారి కూలీలుగా పని చేయాల్సి వస్తుందన్నారు. కావున రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జీవో–39ను ఉపసంహరించుకోవాలన్నారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలంటే ముందుగా మడకశిర బ్రాంచ్ కెనాల్‌ను 6వేల క్యూసెక్కుల సామర్థ్యంతో వెడల్పు చేసి అన్ని చెరువులను నీటితో నింపాల న్నారు. సిఎం చంద్రబాబు హామీ మేరకు వక్క, ఆకు రైతులకు మార్కెట్ సౌకర్యం కల్పించాలన్నారు. మల్బరీ, పండ్ల తోటల రైతులను ఆదుకోవాలన్నారు. అలాకాకుండా సోలార్ ప్రాజెక్టులకు భూములు తీసుకుంటే కేవలం కార్పొరేట్లకు లాభం చేకూర్చుతుందే తప్పా రైతులకు ఏమాత్రం ఉపయోగం లేదన్నారు. మడకశిర, పరిగి మండలాల్లో 21 ఏళ్ల క్రితం సెజ్ పేరుతో సేకరించిన భూములను తిరిగి రైతులను వెనక్కి ఇవ్వాలన్నారు. ఆయనతో పాటు సంఘం కో కన్వీనర్ వేమారెడ్డి, నాయకులు ప్రభాకర్, కెవిపి జిల్లా ఉపాధ్యక్షులు రామంజి , ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వీరేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎపి రైతు సంఘం నాయకులు

రక్తనిధి ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తనిధి (బ్లడ్ బ్యాంక్) ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళ వారం సిఐటియు, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆర్డీవో మహేష్‌కు వినతి పత్రం ఇచ్చారు. సిఐటియు మండల కన్వీనర్ జెవి.రమణ, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నామాల నాగార్జున మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి ప్రతి రోజూ వేలాది మంది ప్రజలు వైద్యం కోసం వస్తుంటారన్నారు. ప్రధానంగా గర్భిణులు, ప్రమాదాలకు గురైన వారికి రక్తం చాలా అవసరం ఉంటుందన్నారు. అలాంటి వారి కోసం ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంకు ఏర్పాటు చేసి ప్రాణాలు కాపాడాలని కోరారు. లేనిచో విద్యార్థి, యువజన, కార్మిక, చేనేత, అఖిలపక్షం నాయకులతో పాటు ప్రజలతో కలిసి ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని స్పష్టం చేశారు. వినతి ఇచ్చిన వారిలో ఎల్.ఆదినారాయణ, అనిల్, అమన్, హరి ఉన్నారు.



ఆర్‌డిఓ మహేష్‌కు వినతి ఇస్తున్న సిఐటియు నాయకులు

ఉచిత వేసవిబడిని సద్వినియోగం చేసుకోవాలి



ప్రచార పుస్తకాలను ఆవిష్కరిస్తున్న నీలకంఠారెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని త్యాగరాజ నగర్ లో గల మార్గదర్శి విద్యానికేతన్ పాఠశాల ఆవరణలో మే నెల 1 వ తేదీ నుంచి జూన్ నెల 1వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఉచిత వేసవి బడిని విద్యార్థులందరు సద్వినియోగం చేసుకోవాలని సువర్ణ భారతీ జూనియర్ కళాశాల వ్యవస్థాపక అధ్యక్షులు, ప్రిన్సిపల్ నీలకంఠ రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని దాతల సహకారంతో గత 27 సంవత్సరాల నుంచి కె.సాయికళ, కె.మాళప్ప దంపతులు వేసవి బడి నిర్వహిస్తున్నారన్నారు. ఈ సంవత్సరం దాతలు అరుణ, సివి నాగరాజు సౌజన్యంతో నిర్వహిస్తున్నారు. దీనికి సంబంధించిన ప్రచార పుస్తకాలను మంగళవారం పాఠశాలలో నీలకంఠ రెడ్డి, కళాశాల ఎఓ అనీల్ కుమార్ తో కలిసి విడుదల చేశారు. కరాటే, కంప్యూటర్, యోగ, క్రీడలు, సంగీతం, నత్యాలు, చిత్ర లేఖనం, చక్కని దస్తూరి తదితర విద్యలలో విలువలతో కూడిన శిక్షణ అందిస్తున్నామన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాల న్నారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాపకులు వెంకట్, జనార్ధన్, అరుణ, అభిలాష, అకౌంటెంట్ రాము పాల్గొన్నారు.

విద్యార్థులు పట్టుదలతో చదవాలి

ప్రజాశక్తి-హిందూపురం

విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణతో వ్యవహరిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని బిట్ డిప్లమో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్ పేర్కొన్నారు. మంగళవారం కళాశాలలో సస్మోస్ కంపెనీ ప్లేస్ మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ ఎలక్ట్రానిక్స్, డిఫెన్స్ రంగంలో పనిచేసే సస్మోస్ కంపెనీ 15 మంది డిప్లొమా తృతీయ సంవత్సరం విద్యార్థులను ఎంపిక చేశారు. అదే విధంగా 25 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులను ఇంటర్నెట్ షిప్ కు ఎంపిక చేశారు. ఈ నియామక కార్యక్రమం కాలేజీ క్యాంపస్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సంబంధిత కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ రమేష్

ప్రతిభా విద్యార్థినికి ప్రోత్సాహకం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని సూగూరు టీడీపీ నాయకులు సిద్ధప్ప కుమార్తె చందన ప్రియ ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాలలో 990 మార్కులు సాధించింది. ఈ విషయం తెలుసుకున్న టిడిపి నేతలు మంగళవారం చందన ప్రియను కార్యాలయానికి పిలిపించి అభినందించారు. టీడీపీ సీనియర్ నాయకులు గ్రీన్ పార్క్ నాగరాజు రూ.10 వేల నగదు పారితోషకాన్ని మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, ఎంఎల్ఎ వ్యక్తిగత కార్యదర్శి సురేంద్ర చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి కార్పోరేషన్ డైరెక్టర్ బేవినహళ్లి ఆనంద్ కుమార్, కౌన్సిలర్ సతీష్ కుమార్, టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షులు శివశంకర్, కిరికెర మాజీ సర్పంచి రాము, టీడీపీ నాయకులు ప్రెస్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



చందనప్రియకు నగదు అందజేస్తున్న టిడిపి నాయకులు

సిహెచ్‌ఒల వినూత్న నిరసన

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

తమ న్యాయమైన డిమాండ్లను తీర్చాలని కోరుతూ సిహెచ్‌ఒలు వారం రోజుల నుంచి శాంతియుత నిరసన, ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన సిహెచ్‌ఒలు పట్టణంలోని డిఎంహెచ్‌ఒ కార్యాలయం ముందు మోకాళ్లపై నిల్చొని వినూత్నంగా నిరసన తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్లను తీర్చాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎపిఎంసిఎ జిల్లా అధ్యక్షులు కార్తీక్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ నందీశ్వర్‌రెడ్డి, చందన, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.



మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న సిహెచ్‌ఒలు

క్లాప్ మిత్రలకు సన్మానం

ప్రజాశక్తి-బుక్కపట్నం

గ్రామాల పరిశుభ్రతలో పారిశుద్య కార్మికుల పాత్ర ఎంతో కీలకమని డిఎల్‌పిఒ సమత పేర్కొన్నారు. ఆమె మంగళవారం మండలంలోని సిద్ధరాంపురం, గూనిపల్లి గ్రామాల్లో పర్యటించి చెత్త సంపద కేంద్రాలను తనిఖీ చేశారు. ఇంటింటికీ చెత్త సేకరణలో సిద్ధరాంపురం గ్రామపంచాయతీ జిల్లాలో మొదటి స్థానంలో నిలవడానికి కారణమైన నలుగురు క్లాప్ మిత్రలను శాలువాలు, పూల మాలలతో సన్మానించారు. ఆమె మాట్లాడుతూ వారు ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించి పంచాయతీని జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిపారని అభినందించారు. కార్యక్రమంలో అధికారులు అశోక్‌కుమార్‌రెడ్డి, సర్పంచి రమణయ్య, కార్యదర్శి శంకర్, తదితరులు పాల్గొన్నారు.



క్లాప్ మిత్రలను సన్మానిస్తున్న డిఎల్‌పిఒ సమత

పలువురికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

పట్టణ పరిధిలోని ఎనుములపల్లి గ్రామంలో వైసిపి సీనియర్ నాయకులు బీరే నారాయణ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే మంగళవారం మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి వారి ఇంటికి వెళ్లి నారాయణ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఇదే గ్రామానికి చెందిన రామకృష్ణారెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకొని ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. అలాగే పాత్రికేయులు ఎద్దుల మదన్‌మోహన్‌రెడ్డి ద్విచక్ర వాహన ప్రమాదానికి గురైన విషయం తెలుసుకొని అతడిని పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే వెంట వైసిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నేడు జాబ్‌మేళా

ధర్మవరం రూరల్ : ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని శ్రీసాయిరామ్ ఐటిఐ కళాశాలలో జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు మంత్రి కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్, జిల్లా స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ బండ్ల హరికృష్ణ తెలిపారు. జాబ్‌మేళాలో 10 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, బి.ఫార్మసీ/ఎం ఫార్మసీ, నర్సింగ్/ ఏదేని డిగ్రీ, ఏదేని బి.టెక్, పి.జి, చదివి 18–30 ఏళ్ల లోపు వారు అర్హులన్నారు. వివరాలకు 9182288465 సంప్రదించాలన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి

కొత్తచెరువు : వేసవి సెలవుల్లో విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి కె.జయరామ్ సూచించారు. స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో మంగళవారం విద్యార్థులకు పుస్తక పఠనం, కథలపై అవగాహన కల్పించారు. అలాగే గ్రంథాలయంలో ఉన్న దినపత్రికలు, వివిధ పోటీ పరీక్షలు, కథల పుస్తకాలను విద్యార్థులు ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో అటెండర్ వెంకటరమణ, రిటైర్డ్ ఎంపిడిఒ మహమ్మద్, పాఠకులు పాల్గొన్నారు.

4న మాదిగ ఎమ్మెల్యేల ఆత్మీయ అభినందన సభ

మడకశిర : మే 4వ తేదీ అనంతపురం నగరంలోని మాసినేని గ్రాండ్ ఫంక్షన్ హాలులో మాదిగ ఎమ్మెల్యేలైన ఎంఎస్.రాజు, బండారు శ్రావణి, బొగ్గుల దస్తగిరి, గిత్త జయసూర్యలతో ఆత్మీయ అభినందన సభ నిర్వహిస్తున్నట్లు ఎంఈఎఫ్ తాలూకా అధ్యక్షులు రంగనాథ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలో 'ఆత్మీయ అభినందన సభ' కరపత్రాలను ఎంఈఎఫ్ ఉద్యోగి లక్ష్మీనారాయణ విడుదల చేశారు. రంగనాథ్ మాట్లాడుతూ అభినందన సభకు ఎంఈఎఫ్ ఉద్యోగులు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ జిల్లా నాయకులు డాక్టర్.శివన్న, జి.రామకృష్ణ, మారుతిప్రసాద్, డిఎన్. రంగయ్య, పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

పెనుకొండ టౌన్ : బిడ్డ పుట్టినప్పటి నుంచి 6 నెలల వరకూ తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని ఐసిడిఎస్ సిడిపిఒ జి.శాంతలక్ష్మి సూచించారు. పట్టణంలోని శ్రీచైతన్య మండల సమాఖ్య కార్యాలయంలో మంగళవారం సిడిపిఒ ఆధ్వర్యంలో పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. సిడిపిఒ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ప్రశాంత జీవిత గడపాలని, పోషకాహారం తీసుకోవాలని సూచించారు. మే 2 నుంచి జూన్ 10వ తేదీ వరకూ అన్ని గ్రామాల్లో కిశోరి వికాసం ప్రోగ్రామ్స్ ఖచ్చితంగా నిర్వహించాలన్నారు. బాల్య వివాహాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీధర్‌బాబు, ఎంపిడిఒ భాగ్యరేఖ, పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ గంగాధర్‌నాయక్, మెప్మా ఎపిఎం సాధిక, మురళీ, సూపర్‌వైజర్స్ పుష్పలత, జి.ఎర్రమ్మ పాల్గొన్నారు.

తలుపుల : గర్భిణుల్లో రక్తహీనతను నియంత్రించేందుకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికా హారం ఎంతో దోహదపడుతుందని కదిరి ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ రాధిక తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం సిడిపిఒ రాధిక, ఎంపిడిఒ రామానాయక్ పౌష్టికాహార పక్షోత్సవం పోస్టర్లను ఆవిష్కరించారు. అలాగే అంగన్వాడీలు, పిహెచ్‌సి సిబ్బంది, జిఎంఎస్‌కెలకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు దీప, అలివేలమ్మ, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా స్థానిక సాయిబాబా గుడి ప్రాంగణంలో ఐసిడిఎస్ పిడి శ్రీదేవి ఆధ్వర్యంలో తల్లిబిడ్డ వారోత్సవాలు నిర్వహించారు. పిడి మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని, అలాగే పలు సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఇఒ ఆంజనేయనాయక్, సూపర్వైజర్ సుభారాణి, నాయకులు వెంకటరమణ, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డివి ఆంజనేయులు, అంగన్వాడీ యూనియన్ జిల్లా కోశాధికారి శ్రీదేవి, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

రొద్దం : స్థానిక వెలుగు కార్యాలయంలో పౌష్టికాహార పక్షోత్సవ అవగాహన సదస్సు నిర్వహించారు. యానిమేటర్లు, అంగన్వాడీ కార్యకర్తలకు ముఖ్యఅతిథులు సిడిపిఒ శాంతలక్ష్మి, ఎంపిడిఒ రామ్‌కుమార్ పోషణ పక్వాడాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ గిరినాథరావు, వెలుగు ఎపిఎం, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎం. సుజాతమ్మ, సీసీలు, అంగన్వాడీ కార్యకర్తలు, మహిళా కార్యదర్శులు, యానిమేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

హిందూపురం : రూరల్ మండలం తూముకుంట ఎస్సీ కాలనీకి చెందిన రాజు (35) అనే వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన రాజు హరికథలు చెప్పే వారికి సహాయం చేస్తూ ఉండేవాడన్నారు. మద్యానికి బానిసైన ఆయన తరచూ భార్యతో గొడవపడేవాడని చెప్పారు. సోమవారం రాత్రి ఇద్దరి మధ్య గొడవ జరిగిందని దీంతో మనస్థాపానికి గురైన రాజు ఇంటి పైకి వెళ్లి సిమెంట్ ఫిల్లర్ కు తన లుంగీతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని చెప్పారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

రొద్దం : మండలంలోని చెరుకూరు, కర్నాటకలోని దొమ్మతిమర్రి మధ్యలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం పోలీసులు సీజ్ చేసి స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు. చెరుకూరు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు అక్రమంగా కర్నాటకకు ఇసుక రవాణా చేస్తున్న విషయం తెలుసుకున్న పోలీసులు కాపుకాచి ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని స్టేషన్‌కి తరలించారు. అలాగే కేసు నమోదు చేసి రెవెన్యూ అధికారులకు రెఫర్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.